# దేవుడి పెళ్ళి

దేవుడి పెళ్ళి జరుగుతూంది.

ఆకాశమంత పందిరీ, భూమంత అరుగూ వేసి జగన్నాథం దంపతులు దేవుడి పెళ్ళి మహా వైభవంగా జరుపుతున్నారు.

మేళతాళాలూ, బంధుమిత్రులూ, మల్లెపువ్వులూ, మంచిగంధం, అత్తరూ, పన్నీరుల సువాసనలతో మత్తెక్కిస్తూంది ఆ పెళ్ళిపందిరి వాతావరణం. దేవుడి పెళ్ళికి వచ్చిన పెద్దలమీద పన్నీరు జల్లుగా కురుస్తూంది. స్త్రీలు పట్టుచీరెల పరపరలతో, చేతిగాజుల గలగలలతో ఇటూ అటూ తిరుగుతున్నారేగానీ, తలలోని పూవులూ, ఒంటిన ఉన్న ఆభరణాల బరువూ వారిని క్రుంగదీసేస్తూన్నట్టు సొక్కుతూ, సోలుతూ తిరుగుతున్నారు. పాపం! ఆ అలసటకి వారి ఒళ్ళంతా చెమటలు కారిపోతున్నాయి.

విసనకర్రతో విసురుకునే ఓపికకూడా లేదు వాళ్ళకి, పాపం! ఇది గ్రహించిన పెళ్ళిపెద్ద జగన్నాథం గారు గావు కేక పెట్టారు బొంగురు గొంతుతో - "పంకాలు వెయ్యండ్రా" అని. పంఖాలు గిర్రున తిరగటం మొదలెట్టాయి. 'మైక్' లో పెళ్ళి మంత్రాలు ఊరందరి చెవులూ చిల్లులు పడేలా వినిపిస్తున్నాయి 'దేవుడి' పెళ్ళికి అందరూ పెద్దలే అన్న సత్యం ఈ పెళ్ళి పందిరిలోనే కనిపిస్తూంది.

జగన్నాథంగారు ముచ్చటగా మూడు లక్షలకి అధికారి. మన ప్రభుత్వం అధిక జనాభాని కంట్రోల్ చేయలేక అలిసిపోతూంది కానీ, జగన్నాథంగారికి వంశం నిలబట్టే ఓ నలుసు లేదు. సంతానం కోసం ఎందరో దేవుళ్ళని పూజిస్తూనే ఉంటాడు. ఎన్ని పూజలు చేసినా, ఎందరు స్వాములని సేవించినా, మరెందరో అమ్మవార్ల తీర్థప్రసాదాలు తీసుకున్నా ఏమీ ప్రయోజనం లేకపోయింది ఇప్పటివరకూ. భవిష్యత్తు చెప్పలేముగా?

తమ కోరిక తీరకున్నా భగవంతుడిని సేవించటం మానలేదు జగన్నాథం దంపతులు. కేవలం పూజించటమే కాదు, తీర్థయాత్రలు చేస్తూ, ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా దేవుడిపెళ్ళి వైభవోపేతంగా చేస్తూ తోటివారి ప్రశంస లందుకుంటూనే ఉన్నారు. దేవుడి పెళ్ళికి ఎంత లేదన్నా అయిదారువేలు పైనే ఖర్చు అయిపోతుందని అంటారు. అయితే ఏం? దేవుడి పెళ్ళికి కట్నాలూ,

కానుకలూ కుంభవృష్టిగా కురుస్తాయి. వివాహానికి వచ్చే ప్రతివారూ కానుకలు చెల్లించి, విందుభోజనం ఆరగించి "బ్రేవ్" మని త్రేపి దేవుడి పెళ్ళిని ఇంత భక్తిగా జరిపించిన జగన్నాధంగారిని, ఆశీర్వదించి మరీ వెళ్ళిపోతారు. ఇలా చాలా సంవత్సరాలుగా జరుగుతున్నది. అలాగే ఈ సంవత్సరమూ జరుగుతూంది.

పెళ్ళి మంత్రాలు మైకులో వినిపిస్తూనే ఉన్నాయి. వివాహానికి వచ్చిన బంధుమిత్రు లందరూ పెళ్ళి పందిరిలో వున్నా, సీత మాత్రం దేవుడి పెళ్ళికి తలంబ్రాలు పళ్ళెంలో సర్దుతూ సామానుల గదిలోనే వుంది.

ఈ సీత ఓ కుచేలుడి అయిదో కూతురు. తన తరువాతకూడా నలుగురు చెల్లాయిలున్నారు మరి ఈ కాలంలో కూడా కలియుగ కుచేలులు అక్కడక్కడా కనిపిస్తూనే ఉంటారు అనేదానికి ఈ సీత తండ్రి గట్టి సాక్ష్యం.

ఈ కలియుగ కుచేలుడికి ఓ చిన్న ఉద్యోగం, వచ్చేది చాలక సరం లేనినాలుకని ఇష్టం వచ్చినటు ఉపయోగించుకుని, పిల్లైనన్ని అబద్ధాలాడి, అప్పులుచేసి, చివరికి ఒటలు కట్టి తన్నులు తిని ఆ ఊరునించి కాపరం ఎత్తుకు పారిపోబోతూంటే, అప్పటికే అయిదు వందలు అసలూ, దానికి వడ్డీ పెరిగి పెరిగి బోలెడంత అయిందన్న కోపంతో, అసలుకూడా గల్లంతనే భయంతో జగన్నాథం భార్య మంగమ్మ అపర కాళిలా అడ్డగించింది.

తననీ, తన పిల్లలనీ, భార్యనీకూడా మింగేస్తుందేమో అన్న భయం పట్టుకుని తన "అప్పు"కి గాను అయిదో కూతుర్ని తాకట్టుపెట్టి ఆ ఊరునించి వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయాడు కుచేలుడు.

తండ్రి చేసిన అప్పుకుగాను తాకట్టు సొమ్ములా మిగిలిపోయింది సీతామహాలక్ష్మి అనబడే ప్రాణం ఉన్న సీత. నాలుగు సంవత్సరాలు గడిచినా తండ్రి జాడ లేదు. చక్రవడ్డీ పెరిగి పెరిగి ఇంక ఈ అప్పు తీరేది కాదనీ, తనకి ఈ 'చెర' నుంచి విముక్తి లేదనీ సీత ఆలస్యంగా అయినా తెలుసుకుంది. సీత జగన్నాథంగారి ఇంట్లో పనిమనిషి, చాకలి మనిషి, వంటమనిషి. ఇవన్నీ కాక, ఆ ఇంటి యజమానికి చాలా విధాల ఉపయోగిస్తూంది.

'ఆకలికింత అన్నం, శరీరం కప్పుకునేందుకింత బట్టా ఉంటే చాలు, మరేం అక్కరలేదు' అనుకునేది సీత తల్లిదండ్రుల దగ్గర ఉపవాసా లుండేప్పుడు. అయితే మంగమ్మ ఉదార హృదయం వల్ల సీత తిండికీ, బట్టకీ మరేం ఫర్వా లేదు. రెక్కలు ముక్కలు చేసుకుని ఎన్ని సంవత్సరాలు చాకిరీ చేసినా తండ్రి చేసిన అప్పు తీరేలా కనిపించలేదు. ఈ జన్మకింక ఇంతే.. తనకి ఒక్కడే తండ్రి, ఒక్కతే తల్లి. కాని, వాళ్ళకి మాత్రం తను ఒక్క కూతురే కాదు. అవును, అంతే. ఈ భావం రాగానే సీత మనస్సు పాషాణంలా అయిపోయింది.

యాంత్రికంగా రోజులు గడిచిపోతున్నాయి. అయితే

ఒక కోరిక సీతని నిలవనీయటం లేదు. అదేమిటంటే, తనూ జీవితంలో ఒక్కసారి అంటే ఒక్కసారి పెళ్ళికూతురు కావాలి.

కాళ్ళకి పసుపు పారాణి, నుదుట కళ్యాణ తిలకం, బుగ్గన చుక్క, కళ్ళకి కాటుక - ఈ అలంకరణతో పెళ్ళి కూతురై పసుపుదారంతో మిలమిలా మెరిసిపోయే మంగళ సూత్రం కట్టించుకోవాలి. వరు డెవరనే ఆలోచనే లేదు సీతకి. అలా పెళ్ళికూతురై మాంగళ్యధారణ జరుగుతుంది. మధుపర్కాంతో అగ్నిదేవునికి ప్రదక్షిణలు చేస్తూ ఉంటుంది. పెళ్ళికి వచ్చిన అతిథులు ఒక్కసారి మంగళా క్షతలు వర్షంలా కురిపిస్తారు. అప్పుడు...అప్పు డెంత బాగుంటుంది!

ఇది ఒక్కసారి జరిగితే చాలు. మరింకేం వద్దు. మిగిలిన జీవితం అంతా ఏ బానిస బ్రతుకైనా సరే, బ్రతగ్గలదు. అవును, తనూ పెళ్ళికూతురు కావాలి. సీతకిలాంటి ఆలోచనలు ఈ రోజే కాదు. ఎప్పుడు, ఎక్కడ పెళ్ళిమేళం వినిపించినా ఉక్కిరి బిక్కిరి చేసాయి మనస్సులో తుఫాను వీస్తూ ఉంటుంది. ప్రతి సంవత్సరం జరిగే ఈ దేవుని పెళ్ళి రోజున మరీ తనని తను నిగ్రహించుకోలేక పోతుంది.

సీతకి ఇరవై రెండేళ్ళప్పుడు 'నే సీతని పెళ్ళి చేసుకుంటా' నని ఓ పాలేరు కుర్రాడు ముందుకొచ్చాడు. "తండ్రి చేసిన బాకీ తీర్చిందే ఇలాంటి పిచ్చి పిచ్చి పనులు జరగటానికి పిల్లేము" అని మంగమ్మ ఖచ్చితంగా చెప్పేసింది

ఇప్పుడు సీత వయస్సు ఇరవై తొమ్మిది. ఈరోజు దేవుడి పెళ్ళికి సీతా అమ్మవారిని అలంకరించే బాధ్యత సీతకి అప్ప గించింది మంగమ్మ. కంచు విగ్రహానికి అలంకరిస్తూన్న ప్పుడు తనని తను సంబాళించుకోలేకపోయింది సీత.

ఫలితం ఏమంటే, పెళ్ళికూతురైన సీతా అమ్మవారు సీత చేతితో నాలుగు మొట్టికాయలు తిన్నా కిమ్మనకుండా బెల్లం కొట్టిన రాయిలా పెళ్ళి పీటలమీద కూర్చుంది. సీత అలంకరించిన కల్యాణ మంటపాన్ని ఓసారి అసూయగా చూసి, తల విసురుగా తిప్పుకొని లోపలికి వెళ్ళిపోయింది. నీరసంగా ఉండి కళ్ళూ, ఒళ్ళూ తిరిగిపోతున్నట్టుగా ఉంది. నిలబడలేక గోడకి చేరగిలబడిపోయింది సీత.

"ఒసే, సీతా! అక్కడ మంగళసూత్రం పెటాను. నే పిలవగానే తలంబ్రాలూ, మంగళసూత్రం జాగ్రత్తగా పెళ్ళి పందిట్లోకి పట్టుకురా. అక్కడే కట్నం చదివించే పట్టుచీర కూడా ఉంది, పట్టుకురా. జాగ్రత్త! నే పిలిచినప్పుడే రా" అంటూ బొంగురు గొంతుకతో అరిచి అప్పుడే వచ్చిన అతి థులని పరామర్శించటానికి గబగబా వెళ్ళిపోయింది మంగమ్మ.

సీత చలనం లేని బొమ్మలా అలాగే కూర్చుని ఉంది. ఎదురుగా తలంబ్రాలూ, వాటితో పచ్చని పసుపు దారం కట్టిన మంగళసూత్రం, వాటికి కాస్తదూరంలో జానెడు వెడల్పు జరీ పట్టుచీర.

సీత కళ్ల ముందున్న ఈ మూడూ గిరగిరా తిరుగుతూ వెక్కిరిస్తున్నాయి. సీత మనస్సులో ఎన్నో సంవత్సరాల నుంచీ అణగదొక్కబడిన ఓ వెర్రి కోరిక మనస్సునీ, ఇంగిత జ్ఞానాన్ని ఓడించేసి సీతని లేవదీసి కూర్చోబెట్టింది. యాంత్రికంగా లేచి ఒక్కో అడుగూ మెల్లగా వేస్తూ వాటి దగ్గరికి వెళ్ళింది. మంగళ సూత్రాన్ని గట్టిగా పట్టుకుని పిడికిలి బిగించేసింది. తలలో ఎన్నో ఆలోచనలూ, ఆశలూ పాముల్లా కదులుతున్నాయి. సీత వాటి ధాటికి తట్టుకోలేక ఓడిపోయింది. సామానుల గది తలుపు గట్టిగా మూసియ బిగించేసుకుంది లోపల.

ఇంక పెళ్ళి పందిరిలో “మంగళసూత్రధారణకి వ్యవధి లేదు. త్వరగా మంగళసూత్రం తెండి...అందరికీ అక్షత లివ్వండి” అంటూ బిగ్గరగా కేకలు పెడుతున్నారు బాపనయ్యలు.

“సీత దగ్గరున్నాయి తీసుకురండర్రా!” మంగమ్మ కేకపెట్టింది.

ఒకరి వెంట ఒకరు ఎందరో ముత్తయిదువులు లోపలికి వెళ్ళారే గానీ, ఒక్కరూ బయటికి రారు. జగన్నాథం భార్యమీద గావుకేకలు పెట్టాడు. మంగమ్మ చరచరా వెళ్ళింది-“ఎక్కడ చచ్చిందీ సీత? దరిద్రపు ముఖంది. ఎన్ని సార్లు చెప్పాను” అంటూ.

"మంగమ్మొదినా, సీత సామానుల గదిలో ఉంది. తలుపు తియ్యటంలేదు, ఏమొచ్చిందో!" అందరూ ఒక్క సారి అన్నారు.

"దీనికి 'బడితపూజ' చేస్తేగానీ బుద్ధిరాదు."

మండిపడిపోతూ జగన్నాధం, మంగమ్మ ఒక్క గొంతుతో పిలిచారు - "సీతా! ఓ సీతా!! తలుపు తెరు" అంటూ.

తలుపులు మెల్లగా తెరుచుకున్నాయి. అక్కడ చేరిన అందరూ ఒకేసారి లోపల జొరబడ్డారు.

జగన్నాథం ఒళ్ళంతా మండిపోతూంది.

"సీతా!" అంటూ సీత కనిపించగానే నిర్ఘాంతపడి శిలావిగ్రహంలా నిలుచుండిపోయారు. మంగమ్మ "ఆఁ" అని నోరు తెరిచేసింది ఒక్కసారి. ఆవిడకూడా ఉన్న అమ్మలక్కలు "ఆఁ" అని నోరు తెరిచేశారు దాకల్లాగా.

సీత, సీతా అమ్మవారికి గాను తెచ్చిన కల్యాణం చీర కట్టుకుని, మంగళసూత్రం మిలమిలా మెరుస్తూంటే తనకి తనే కట్టుకుని, నిశ్చలంగా నిలుచుని ఉంది. అంతేకాదు. నిర్భయంగా జగన్నాధం కళ్ళల్లోకి సూటిగా చూస్తూంది. ఆ కళ్ళలో పిసరంత కూడా భయంలేదు. పైగా, తన చిరకాల వాంఛితం నెరవేరిందనే తృప్తి, సంతోషం కలగా పులగంగా కలిసి చిరునవ్వు పెదవులమీద నాట్యంచేస్తూంది. ఇదంతా

చిత్తరువులా చూస్తూ నిలుచున్న మంగమ్మ క్షణంలో తేరుకుని సీతమీదికి ఆడపులిలా ఉరికింది. మంగళసూత్రం గుంజుకుని, సీతని చావబాది పెళ్ళి పందిట్లోకి పరుగుతీసింది. నిర్ఘాంతపోయి నిలుచున్న జగన్నాథాన్ని బంధుజనం బలవంతంగా లాక్కెళ్ళి పీటలమీద కూర్చోబెట్టారు.

ఇక్కడ సీతని మంగతావాళ్ళు తమ శక్తి ఉన్నంత వరకూ కొట్టి, బయటికితోసి తలుపు గట్టిగా ఘడియపెట్టి, పెళ్ళి పందిట్లోకి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు.

“నే చేసింది తప్పేమిటి? దేవుడు ప్రతి ఏడూ పెళ్ళి చేసుకుంటున్నాడే! నేను...నేను జీవితాని కంతా ఒక్కసారంటే ఒక్కసారి మంగళసూత్రం కట్టించుకోవాలని పెళ్ళికూతురవటం తప్పా? చెప్పండి. తప్పా నే చేసింది?” పిచ్చిదానిలా ఏడుస్తూనే వుంది సీత.

కల్యాణమంటపంలోని పెళ్ళికూతురు సీతా అమ్మవారికే గనక ప్రాణం వుంటే “నాకీ పెళ్ళి వద్దు” అని మొరాయించి ఉండేదేమో? కానీ, ఈ సీతా అమ్మవారు సీత మెడలోనించి గుంజుకొచ్చిన మంగళసూత్రాన్ని ‘కిమ్మ’నకుండా కట్టించుకుంది. పెళ్ళిబాజాలు ఘుమ్మని మోగుతూ ఉన్నాయి. పెళ్ళికి వచ్చిన పెద్దలు అక్షితల వర్షం కురిపిస్తూనే ఉన్నారు.

దేవుడి పెళ్ళి ఏ ఆటంకమూ లేకుండా జరిగిపోతూంది. ఇలా ఇదివరలో ఎన్నోసార్లు జరిగింది - ఇప్పుడూ జరుగుతూంది. ఇంక ముందూ నిక్షేపంగా జరుగుతుంది. ప్రాణం ఉన్న సీత లాంటి పిల్లలని వదిలేసి సీతా అమ్మవారి పెళ్ళి జరిపించటమే కాదు, దేవుడి పెళ్ళి చేసి బోలెడంత పుణ్యం మూటకట్టుకుంటున్నారు.

---